సాక్షి
శ్రీకాకుళం
బుధవారం ׀ 22 ׀ మార్చి ׀ 2023



రేపటి నుంచి దూరవిద్య ప్రాక్టికల్స్

ఏయూ క్యాంపస్: ఏయూ పరిధిలో బీఎస్సీ ప్రాక్టికల్స్ గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకుడు కె.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



25న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు 25వ తేదీన జరగనున్నాయి. జెడ్పీ మీటింగ్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయని జెడ్పీ సీఈఓ ఆర్. వెంకట్‌రామన్ తెలియజేశారు.

23న స్పెషల్ బీఈడ్ తక్షణ ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో స్పెషల్ బీఈడ్ మెంటల్లీ రిటార్డ్ కోర్సులో ఈ నెల 23న తక్షణ ప్రవేశాలు (స్పాట్ అడ్మిషన్లు) నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎడ్‌సెట్-22లో అర్హత మార్కులు సాధించిన వారు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు ఎడ్యుకేషన్ విభాగంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

న్యూస్‌రీల్

వాసుదేవుని సన్నిధిలో ఉగాది వేడుకలు



ప్రత్యేక అలంకరణలో వాసుదేవుడు

మందస: వాసుదేవుని సన్నిధిలో ఉగాది వేడుకలు ఒక రోజు ముందుగానే ప్రారంభమయ్యాయి. స్వామిని దివ్యాలంకృతుని చేసిన పండితులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి ప్రధాన శిష్యులు త్రిదండి అహోబిలరామానుజ జీయర్‌స్వామి మందస వచ్చారు.

నేడు ఉగాది వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ, సాంస్కృతిక, పర్యాటక, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు బాపూజీ కళామందిర్‌లో ఉదయం 10గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇందులో పంచాంగ శ్రవణం, కవితలు, ఉగాది పచ్చడి పంపిణీ వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

నేడు అరసవల్లిలో ఉగాది ఆస్థానం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా బుధవారం జరగనుందని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలియజేశారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజార్చనలు నిర్వహించి అనంతరం అనివెట్టి మండపంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లుగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఆదిత్యుని ఆదాయ వ్యయాలను పంచాంగ రాశిఫలాలను వివరిస్తామని, అలాగే సాయంత్రం ఆలయ పండితుల సమక్షంలో భక్తుల రాశిఫలాలను కూడా తెలియజేస్తామని ప్రకటించారు. ఇక స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రసాదంగా ఉగాది పచ్చడిని అందించనున్నామని, అలాగే భక్తుల దర్శనాలకు వీలుగా ఆలయ అధికారులు చర్యలు చేపట్టినట్లుగా ఆయన స్పష్టం చేశారు.

సర్వే సక్రమంగా చేపట్టాలి: జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేపడుతున్న రీ సర్వే పనులను సక్రమంగా చేపట్టాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం రెండో విడత రీసర్వే పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న రెండో విడత రీ సర్వే పనులు మరింత వేగవంతం కావాలన్నారు. ఇప్పటివరకు చేపట్టిన రీసర్వేలోని అవకతవకలను మరోమారు పరిశీలించుకుని నాలుగు రోజుల్లో సరి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు చేపట్టిన రీసర్వేలో ఉన్న లోటుపాట్లను గమనించి ఇకపై ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఉండేలా చూసుకోవాలని హెచ్చరించారు.

మెగా వాటర్‌గ్రిడ్ పైపులైన్ పనుల పరిశీలన



మెగా పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

పాతపట్నం: ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు నిర్మాణం పనులు వేగవంతం చేయాలని మెగా పైప్‌లైన్ అధికారులకు టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రహరాజపాలెం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న పైప్‌లైన్ పనులను మంగళవారం సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల ప్రహరాజపాలేంలో కొందరు రైతులు పైప్‌లైన్ పనులు అడ్డుకున్నారు. సబ్ కలెక్టర్, రెవెన్యూ, పోలీసులు, అధికారులు మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి పనులు చేపట్టారు. కాగువాడ కొండపై ఉన్న మెగా వాటర్ సంపును కూడా సబ్ కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.700 కోట్లతో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. హిరమండలంలోని వంశధార నుంచి పైప్‌లైన్ ద్వారా పాతపట్నం, మెళియాపుట్టి, పలాస మీదుగా ఇచ్ఛాపురం వరకు తాగునీరు అందించనున్నారు.

• శోభాయమానం..
నవ వసంతం

శుభకృత్ సెలవు తీసుకుంది.. శోభకృత్ వచ్చేస్తోంది. మన జీవితాలు కొత్త శోభ సంతరించుకుంటాయన్న ఆశల వసంతాన్ని మోసుకొస్తోంది. మళ్లీ వస్తున్న వసంతాన్ని సంప్రదాయబద్ధంగా స్వాగతించేందుకు జనావళి సిద్ధమైంది. ఇళ్ల ముంగిళ్లన్నీ పచ్చని మామిడాకుల తోరణాలతో, మార్కెట్లన్నీ కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. ఏరువాక పనులకు రైతన్నలు ఏర్పాట్లు చేసుకున్నారు.

– సాక్షిప్రతినిధి, శ్రీకాకుళం



- కొత్త సంవత్సరానికి సంప్రదాయ స్వాగతం
- సిద్ధమైన తెలుగు లోగిళ్ళు
- కళకళలాడుతున్న ఇళ్లు, మార్కెట్లు
- నేటి నుంచి కొత్త పంటల సాగుకు శ్రీకారం

శ్రీకాకుళం కల్చరల్: వసంతం వచ్చేసింది. నునులేత మామిడి పిందెలు, పచ్చాపచ్చని కొత్త చిగుళ్లతో కాలం చైత్రానికి ఆహ్వానం పలికింది.

షడ్రసోపేతంగా..



ఉగాది రోజున ఆరు రుచులతో పచ్చడి చేసి ఇష్టదైవానికి నైవేద్యంగా సమర్పించి భక్తితో పూజలు చేస్తారు. దీన్నే ప్రసాదాలను స్వీకరిస్తారు. బెల్లం, చింతపండు, మామిడి పిందెలు, వేపపూత, పచ్చిమిరప, ఉప్పు వేసి ఉగాది పచ్చడి చేస్తారు. ఈ పచ్చడి ఖాళీ కడుపుతో తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటారు.

పంచాంగ శ్రవణం..



ఉగాది నాడు పంచాంగ శ్రవణం తప్పనిసరిగా ఉంటుంది. పంచాంగం అంటే పంచ అంగములు గలది అని అర్థం. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనేవి ఆ ఐదు అంగాలు. 15 తిథులు, 7 వారాలు, 27 నక్షత్రాలు, 27 యోగములూ, 11 కరణములు ఉన్నాయి. పంచాంగ శ్రవణంలో ప్రధానంగా ఆ సంవత్సర ఫలితాలు వివరిస్తారు. నిత్య కార్యక్రమాలకు ఇంగ్లిష్ క్యాలెండర్‌నే వాడినా శుభకార్యాలు, పూజలు, పితృదేవతారాధనవంటి విషయాలకు మన పంచాంగాన్నే వాడుతుంటారు.

ఈ రోజునే ఏరువాక



ఈ రోజునే రైతన్నలు తమ హలాలకు(నాగళ్లకు)పూజలు చేస్తారు. పొలంలో ఏరువాక చేసేందుకు తొలి ముహూర్తం పెట్టుకుంటారు. ఉగాదికి రెండు రోజుల ముందు చెరకు, బెల్లం, కందమూలం, పసుపుకొమ్ములు, మోకులు, మూలకర్ర తదితర సామగ్రి కొనుగోలు చేస్తారు. కొత్త కర్ర నాగలిని తయారు చేసి అమావాస్య రోజున ఏరు పూస్తారు. ఈ ఏడాది ఉగాది సందర్భంగా పడమరవైపు ప్రయాణం చేయడం మంచిదని పంచాంగ కర్తలు అంటున్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి..



శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి. వైఎస్ జగన్ పాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి. విశాఖలో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటు కావాలి.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

అన్ని ప్రాజెక్టులు పూర్తి కావాలి



శోభకృత్ నామ సంవత్సరంలో జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు పూర్తి కావాలి. జిల్లా వాసులు ఆయురారోగ్యాలతో ధనం, ధాన్యంతో వర్ధిల్లాలి.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమ మత్స్యశాఖ మంత్రి

సుఖ సంతోషాలతో జీవించాలి



తెలుగు వారికి కొత్త సంవత్సరంలో మంచి జరగాలి. భగవంతుని ఆశీస్సులు అన్నివర్గాల ప్రజలపై ఉండాలి. జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి.

– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్

అందరికీ శుభాలు కలగాలి



శోభకృత్ నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభాలు కలగాలి. సమృద్ధిగా వానలు కురిసి పంటలు బాగా పండాలి.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు



ఆమదాలవలస రూరల్: ఉగాది సందర్భంగా గాజులకొల్లివలస సమీపంలోని సంగమేశ్వర ఆలయం వద్ద గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం

ఉగాది పెద్ద పండగ



సంక్రాంతి తర్వాత మనకు ఉగాది పెద్ద పండగ. మా చిన్నతనంలో ఎంతో సందడిగా ఉగాది పర్వదినం చేసుకునేవాళ్లం. శోభకృత్ నామ సంవత్సరంలో అందరికీ సకలశుభాలు కలగాలి.

– దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ

శోభాయమానంగా ఉండాలి



శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజల జీవితాలు శోభాయమానంగా ఉండాలి. అందరి జీవితాలు అభివృద్ధి చెందాలి.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

ఆనందాలు వెల్లివిరియాలి



శోభకృత్ అంటే చాలా శోభను కలిగించేది. ఈ ఏడాదిలో ఆనందాలు వెల్లివిరియాలి. జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో తులతూగాలి.

– శ్రీకేష్ బి.లాఠకర్, కలెక్టర్

శోభకృతు కోకిలకు స్వాగతం



ఆరు రుచుల ఆమని
మావి చిగురుల ప్రేమని
వేప పువ్వు ఔషధాన్ని
సంతోషమున స్వీకరించి
కొత్త రెక్కలు కట్టుకుని
కొంగ్రొత్త ఉషస్సులు చుట్టుకొని
తరలిరావమ్మా!
శోభకృతు ఉగాది!
మానవాళి మనుగడకు నీవే పునాది.

–కె.వి.రాజారావు, కవి, ఆమదాలవలస.

మార్కెట్ కళ కళ..



ఉగాదికి వ్యవసాయ తొలి పనులకు సామాన్లు కొనుగోలు చేస్తున్న రైతులు

టెక్కలి: తెలుగు ప్రజల కొత్త సంవత్సరం సందర్భంగా వేడుక చేసుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధమయ్యారు. రైతులు తమ స్థితిగతులకు అనుగుణంగా పసిడి వస్తువులను కొనుగోలు చేసుకున్నారు. మొదటగా దుక్కి దున్నేందుకు అవసరమైన వస్తువులు సిద్ధం చేసుకున్నారు.



విక్రయాలతో సందడిగా కాశీబుగ్గ మార్కెట్

శభాష్.. మహిళా పోలీస్



మహిళను భర్తకు అప్పగిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: ఒక అబల.. అర్ధరాత్రి సమయం.. ఏ దారిన అడుగులు పడుతున్నాయో తెలియని మానసిక స్థితి. ఎటువైపు పయనమో తెలియని సందిగ్ధ పరిస్థితి. అలాంటి ఆపత్కాలంలో ఓ మహిళా పోలీసు చూపిన చొరవ ఆ వివాహితను కాపాడింది. అప్పటికే ఇంటిల్లిపాదీ వెతికివేసారిపోగా.. ఆ ఊరిలోని మహిళా పోలీసు విధి నిర్వహణ వల్ల ఆమె మళ్లీ ఇంటికి చేరగలిగింది. టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు..

టెక్కలి మండలం తొలుసూరుపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఓ మహిళ ఒంటరిగా సంచరిస్తోంది. ఆ ఊరిలోని మహిళా పోలీసు మోహిని ఆమెను గమనించి దగ్గరకు వెళ్లి ప్రశ్నించారు. ఆమె సమాధానం చెప్పకపోవడంతో టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణకు సమాచారం అందించారు. దీంతో ఆయన ఏఎస్‌ఐ వెంకటరమణను పంపించి ఆమె వివరాలు కనుక్కోవాలని చెప్పారు. ఏఎస్‌ఐ ఆ మహిళతో కాసేపు మాట్లాడగా.. ఆమె పేరు పొంగ సుమలత అని, ఆమె అయ్యప్పనగర్‌లో ఉంటుందని, ఆమె భర్త శివ అని తెలిసింది. దీంతో పోలీసులు ఆమెను సురక్షితంగా భర్త వద్దకు తీసుకెళ్లి అప్పగించారు. తన భార్యకు మతిస్థిమితం సరిగా ఉండదని, ఆమె కనిపించకపోవడంతో ఊరంతా గాలించామని, ఆమెను సురక్షితంగా ఇంటికి తీసుకువచ్చినందుకు రుణపడి ఉంటానని కన్నీళ్లు పెట్టుకుంటూ కృతజ్ఞతలు చెప్పారు.

ప్రజాస్వామ్యానికి చీకటి దినం



కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశీబుగ్గ: శాసన సభలో టీడీపీ ఎమ్మెల్యేలు ప్రవర్తించిన తీరు హేయమని, ఇది ప్రజాస్వామ్యానికే చీకటి దినమని పలాసలో వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. శాసనసభలో ఎస్సీ ఎమ్మెల్యేపై దాడికి పాల్పడడంతో పాటు స్పీకర్‌పై కాగితాలు విసరడాన్ని వారు తప్పుపట్టారు. ఈ మేరకు మంగళవారం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో గల గాంధీ విగ్రహం వద్ద శాంతి యుతంగా నిరసన తెలిపారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. గతంలో 'మనిషి అనే వాడు ఎవడైనా దళిత కులంలో పుట్టాలి అని కోరుకుంటారా' అన్న చంద్రబాబు నేడు దళిత ఎమ్మెల్యేపై దాడికి పురిగొల్పడంపై ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ స్థానంలో ఉన్న బీసీ ప్రజాప్రతినిధిపై కాగితాలు విసరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు తీరు మార్చుకుని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ మున్సిపల్ వైస్ చైర్మన్లు మీసాల సురేష్, బొర కృష్ణారావు, విప్ దుర్గాశంకర్‌పండా, డబ్బీరు భవాని శంకర్, జోగి సతీష్, బోనెలరాము, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ కొర్లన ఆదినారాయణ, మందస సర్పంచ్ లక్ష్మణరావు, వజ్రపుకొత్తూరు ఎంపీపీ ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, గురయ్యనాయుడు, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

బడిపిల్లల మెనూలో
రాగిజావ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద మెనూలోకి రాగి జావను చేర్చినట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు ఆ కార్యక్రమాన్ని వీక్షించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 2,572 పాఠశాలలు ఉండగా అందులో 1,77,664 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం వినియోగించుకుంటున్నారని తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకంలో బెల్లం కలిపిన రాగిజావను చేర్చడం వల్ల పిల్లల్లో ఐరన్ లోపం, రక్తహీనత వంటి సమస్యలు సమసిపోతాయని తెలిపారు. వారానికి మూడు రోజులు రాగిజావ అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఆర్.జయప్రకాష్, శ్రీకాకుళం శ్రీసత్యసాయి ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రాగి జావను అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



శ్రీకాకుళంలో పిల్లల ఉత్సాహం



ఆటో నుంచి జారిపడి మహిళ మృతి

కొత్తూరు: కొత్తూరు సాయిబాబా గుడి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తూరు సీహెచ్‌సీ పారిశుద్ధ్య కార్మికురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్‌కేపురం గ్రామానికి చెందిన నిమ్మక సావిత్రి(52) కొత్తూరు సీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. అనారోగ్యం కారణంగా మహార్తాపురంలో ఉన్న సోదరి ఇంటివద్ద ఉంటోంది. మంగళవారం ఆటోలో సీహెచ్‌సీకి వెళ్తుండగా డ్రైవర్ ఎడమ వైపున కూర్చున్న సావిత్రి వాహనం అతివేగం కారణంగా జారిపడింది. తీవ్రంగా గాయపడటంతో సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలి భర్త గారేసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవింద తెలిపారు.

ఇంటికే వైద్యం.. మరింత విస్తృతం

- జిల్లాకు అదనంగా 25 'సంచార 104' వాహనాలు
- నేడు ప్రారంభించనున్న మంత్రి ధర్మాన
- 6 నుంచి పూర్తిస్థాయిలో 'ఫ్యామిలీ డాక్టర్' అమలు



రిమ్స్ ప్రాంగణంలో పార్కింగ్ చేసిన కొత్త 104 వాహనాలు

అరసవల్లి : ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దీనిలో భాగంగా 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి ఇప్పటికే జిల్లాలో ట్రయల్‌రన్‌ను పూర్తి చేయగా వచ్చే నెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 260 మొబైల్ మెడికల్ యూనిట్లు (104 వాహనాలు)ను మంజూరు చేయగా, జిల్లాకు 25 వాహనాలు అదనంగా వచ్చాయి. వీటిని బుధవారం మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ నిర్వహణ బాధ్యతలతో ఈ వాహనాలు నడుస్తున్న సంగతి విదితమే. జిల్లాలో 30 మండలాల్లో ఒక్కోటి చొప్పున 104 సేవల వాహనాలు ఆయా పీహెచ్‌సీల పరిధిలో గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్నాయి. తాజాగా జిల్లాకు మరో 25 వాహనాలు రావడంతో ఈ సేవలు మరింత విస్తృతం కానున్నాయి. రాష్ట్రంలో 26 జిల్లాలకు 260 వాహనాలు మంజూరు చేస్తే...అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాకే 25 వాహనాలను కేటాయించారు.

ఫ్యామిలీ డాక్టర్ కోసమే...

ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో భాగంగానే కొత్తగా జిల్లాకు ఈ వాహనాలు కేటాయించారు. ఇప్పటి వరకు నిర్వహించిన ట్రయల్ రన్‌లో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో నెలకు ఒక రోజు చొప్పున విజిట్స్ జరిగాయి. కొత్త వాహనాల రాకతో నెలకు రెండు రోజుల పాటు గ్రామాల్లో ఉచిత వైద్య సేవలందనున్నాయి. వివిధ రోగాలు, ప్రమాదాలతో ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు పీహెచ్‌సీ వైద్యుడు నేరుగా వెళ్లి వైద్యం అందించేలా ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి రూపకల్పన చేసి సంగతి విదితమే.

నేడే ప్రారంభం



జిల్లాకు అదనంగా వచ్చిన 25 వాహనాలను మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం ప్రారంభించనున్నారు. కొత్త వాహనాలతో కలిపి మొత్తం 104 వాహనాల సంఖ్య 55కి పెరిగింది. 30 మండలాల్లో అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఒక్కో గ్రామంలో నెలకు రెండు సార్లు ఇంటింటికీ వెళ్లి వైద్యం అందించనున్నారు. ఈమేరకు వైద్యులు, సిబ్బంది నియామకాలను సైతం పూర్తి చేశారు.

– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

మాట్లాడుతున్న కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్



స్పీకర్‌పై దాడి సరికాదు

- చంద్రబాబు, లోకేష్‌ల వద్ద మార్కుల కోసమే అచ్చెన్న పిచ్చి అరుపులు
- కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ధ్వజం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీ సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ తమ్మినేని సీతారాంపై టీడీపీకి చెందిన అచ్చెన్నాయుడు, మరికొంతమంది దాడి చేయడం సరికాదని కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మండిపడ్డారు. నోటికొచ్చినట్లు మాట్లాడుతూ కాగితాలు విసిరి వీధి రౌడీల్లా ప్రవర్తించిన బాధాకరమని పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తిలక్ మాట్లాడుతూ కాళింగులంటే చంద్రబాబు, అచ్చెన్నలకు ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్‌ల మెప్పు కోసమే స్పీకర్‌పై దాడి చేశారని మండిపడ్డారు. దేశవిదేశాల్లో ఉన్న కాళింగులంతా టీడీపీ నేతల తీరుపై మండిపడుతున్నారన్నారు. టీడీపీ అధ్యక్ష పదవిని అచ్చెన్నకు కట్టబెట్టాక రాష్ట్రవ్యాప్తంగా పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయిందన్నారు. టెక్కలిని వదిలేసి విశాఖపట్నం, హైదరాబాద్‌లలో ఉన్న అచ్చెన్నకు టెక్కలిలో జరుగుతున్న అభివృద్ధి ఏం తెలుస్తుందన్నారు. అచ్చెన్న ఆస్తులు కాపాడుకోవడానికి ఉన్న తాపత్రయం ప్రజా సమస్యలపై ఉండటం లేదన్నారు. మహేంద్రతనయ ఆఫ్‌షోర్, భావనపాడు పోర్టు, ఉద్దానం తాగునీటి ప్రాజెక్టుల వంటి పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగాయన్నారు. జిల్లాను 40 ఏళ్లుగా కింజరాపు కుటుంబం దోచుకుందే తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. పబ్లిసిటీ కోసం తప్పుడు ప్రచారం చేసి పబ్బం గడుపుకోవడం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అవినీతిని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ రాజ్యాన్ని ప్రజలు గమనించారని చెప్పారు. పలాస మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు, సరుబుజ్జిలి ఎంపీపీ కిల్లి వెంకట సత్యనారాయణ, ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవిలు మాట్లాడుతూ బీసీ వ్యక్తి స్పీకర్‌గా ఉంటే అచ్చెన్నకు ఎందుకంత అసూయ అని ప్రశ్నించారు. సజావుగా జరుగుతున్న సభలో కుమ్ములాట సృష్టించడం సరికాదన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నడుపూరు శ్రీరామమ్మూర్తి, హేమసుందరబాబు, సత్తారు సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు–లారీ ఢీ

- ఐదుగురికి గాయాలు



హరిపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మందస: మండలంలోని బిన్నలమదనాపురం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. పలాస వైపు నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ కూడా బస్సును ఢీకొంది. ముందు, వెనుక వైపుల నుంచి బలంగా రెండు లారీలు ఢీకొనడంతో ప్రయాణికులు భీతిల్లారు. బస్సు ముందు దెబ్బతినగా, డ్రైవర్ రమణ, కండక్టర్ ఉమామహేశ్వరరావులతో బస్సులో ప్రయాణిస్తున్న ఎల్.మేనక, జి.మీనాక్షి, బి.కుమారిలకు తీవ్ర గాయాలవ్వడంతో 108 అంబులెన్స్‌లో హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కండక్టర్‌ను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణవలస సంత ఆశీలు వేలం ఖరారు

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస (గురువారపు) సంత ఆశీలు వేలం పాట రూ.90 లక్షల 5 వేలకు ఖరారైంది. మంగళవారం కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, ఈఓపీఆర్‌డీ తులా రాజారావు, వెటర్నరీ ఏడీ ఎం.లోకనాథం, ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామానికి చెందిన యాళ్ల రాము పాట దక్కించుకున్నారు. గత ఏడాది రూ.56లక్షల 5 వేలకు పాట ఖరారుకాగా ఈ ఏడాది అదనంగా రూ.34 లక్షలు రావడం విశేషం. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ రాజేశ్వరమ్మ, సీనియర్ అసిస్టెంట్ వి.వెంకటరావు, వెటర్నరీ సహాయకులు ఎస్.శాంతారావు, వి.భానోజీరావు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలే శరణ్యం



కోమర్తి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

నరసన్నపేట: సమస్యల పరిష్కారానికి సంఘటిత సమరశీల పోరాటాలను నిర్మించడమే కోమర్తి అమరవీరులకు నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ అన్నారు. భూస్వామ్య, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగే పోరాటాల్లో ఎందరో వీరులు అమరత్వం చెందారని, వారి బాటలోనే మామిడి అప్పలసూరి, గుమ్మడి లచ్చయ్య, మామిడి లచ్చిమ్మలు నడిచారని పేర్కొన్నారు. కోమర్తిలో మామిడి అప్పలసూరి 26వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ అమరుల ఆశయాలను కొనసాగించాలని కోరారు. అంతకుముందు అరుణోదయ జిల్లా అధ్యక్షుడు మార్పు మల్లేశ్వరరావు జెండా ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడి క్రాంతి, దుర్గాశి గణేష్‌లు మాట్లాడుతూ కోమర్తి అమరవీరుల వర్ధంతి 26 ఏళ్లుగా చేపట్టడం, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం వారి త్యాగాలకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రగతి శీల మహిళా మహిళా సంఘం అధ్యక్షురాలు ఎస్.కృష్ణవేణి, సీనియర్ జర్నలిస్టు చింతాడ కృష్ణారావు, పార్టీ ప్రధాన నాయకులు నేతింటి నీలంరాజు, చిత్తిరి లక్ష్మణరావు, బుసకల రంగారావు, లక్ష్మీనారాయణ, కొల్లి చిన్నబాబు, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు అమృత్ జలధార రుణాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమృత్ జలధార పథకం ద్వారా ఎస్సీ రైతులకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి వసతులు లేని షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతుల భూములకు నీటి వసతి కల్పించేందుకు ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొన్నారు. కనీసం 2 ఎకరాల 50 సెంట్ల భూమి కలిగి ఉండి వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉన్న రైతులు అర్హులని తెలిపారు. బోరు బావులు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్స్ ఏర్పాటుకు చేయూతనందిస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ ఖరీదులో 50 శాతం సబ్సిడీ గానీ, రూ.50,000 రాయితీ గానీ మించకుండా మంజూరు చేస్తామని తెలిపారు. పథకం పొందాలంటే తప్పనిసరిగా ఏ ఇతర పథకాల ద్వారానైనా బ్యాంకు ద్వారా 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రుణం పొంది ఉండాలని స్పష్టం చేశారు.

యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ పథకంలో భాగంగా నిరుద్యోగ ఎస్సీ యువతకు ట్రాక్టర్, ట్రాలీ, కమర్షియల్ వాహనాలు, వేర్ హౌసెస్ తదితర స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఈడీ పేర్కొన్నారు. ప్రాజెక్టు ఖరీదులో 50 శాతం సబ్సిడీ గానీ రూ.60,000 రాయితీ గానీ మించకుండా మంజూరు చేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 27లోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. తెలుపు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్ ఫొటో, కుల, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా పుస్తకం అందజేయాలని పేర్కొన్నారు.

పోలీసు కుటుంబాలకు చెక్కుల అందజేత



పోలీస్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన పోలీసుల కుటుంబాలకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధిక చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. అనారోగ్యంతో మరణించిన పోలీస్ కానిస్టేబుళ్లు కె.వి.రామకృష్ణ, చుక్కారావు, అప్పలనాయుడులే కాక రహదారి ప్రమాదంలో మరణించిన ఎస్.మల్లేశ్వరరావుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కార్పస్ ఫండ్ ప్రకారం ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందించారు. ఎల్లప్పుడూ పోలీసు శాఖ అండగా నిలుస్తుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215